క్లుప్తంగా

గాలికొదిలేశారు..!

• శిథిలావస్థలో తుపాన్ షెల్టర్



దుస్థితిలో ఉన్న షెల్టర్

తోటపల్లిగూడూరు: భారీ వర్షాలు, తుఫాన్ల వంటి ప్రకృతి విపత్తుల సమయంలో ఆసరా కల్పించేందుకు నిర్మించిన తుపాన్ షెల్టర్లు భూత్ బంగ్లాలుగా మారిపోయాయి. కనీస సౌకర్యాలు లేకపోవడంతో పది నిరుపయోగంగా మారిపోతున్నాయి. ముఖ్యంగా కోడూరు పంచాయతీలోని ముత్యాలతోపు పట్టపుపాళెంలో ఉన్న షెల్టర్ దారుణంగా ఉంది. ఇది శిథిలావస్థకు చేరింది. విద్యుత్ సౌకర్యం, తాగునీటి వసతి లేదు. వర్షాకాలం మొదలైన నేపథ్యంలో అధికారులు స్పందించి సౌకర్యాలను కల్పించాల్సిన అవసరం ఉంది.

డేంజర్ మలుపు



పొదలకూరు: మండలంలోని సంగం – పొదలకూరు మార్గంలో తాటిపర్తికి సమీపంలో ప్రమాదకర మలుపు ఉంది. ఇక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆర్అండ్బీ అధికారులు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాల్సిందిగా వాహనచోదకులు విజ్ఞప్తి చేస్తున్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



పొదలకూరు: స్థానిక మినీ స్టేడియంలో శుక్రవారం మండల స్థాయి క్రికెట్ పోటీలను ప్రారంభించారు. గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ బహుమతులను స్వర్ణ గార్డెన్స్, వెడిచెర్ల మురళి, కుమార్, చందు అందజేస్తారని నిర్వాహకులు తెలిపారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు.

నూతన పాలకమండలి ఏర్పాటు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని జొన్నవాడలో వెలసిన మల్లికార్జున సమేత కామాక్షితాయి ఆలయానికి నూతన పాలకమండలిని నియమిస్తూ ఉత్తర్వులను దేవదాయ శాఖ కమిషనర్ శుక్రవారం జారీ చేశారు. తిరుమూరు అశోక్‌రెడ్డి, నక్కల శివకృష్ణ, నందకుమార్, సుమలత, వరలక్ష్మి, చాముండేశ్వరి, శ్రీనివాసులు, ప్రత్యూష, శ్రీధర్, సుధారాణి, శారదను ఖరారు చేశారు. వీరిలో ఒకర్ని చైర్మన్‌గా ఎన్నుకోనున్నారు. ఎక్స్ అఫీషియో మెంబర్‌గా వారణాసి వెంకటశివగంగాప్రసాద్ వ్యవహరించనున్నారు.

బంగారం చోరీ

వెంకటాచలం: తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన ఘటన మండలంలోని అనికేపల్లిలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన సంధ్య నాలుగు రోజుల క్రితం తన ఇంటికి తాళం వేసి బంధువుల గ్రామానికి వెళ్లింది. గురువారం తిరిగి రాగా తాళాలు పగలగొట్టి తలుపులు తెరిచి ఉన్నాయి. దీంతో చోరీ జరిగిందని గుర్తించి పోలీసులకు సమాచారం అందించింది. వారు శుక్రవారం గ్రామానికి వచ్చి ఇంటిని పరిశీలించారు. రూ.2.35 లక్షల విలువైన బంగారు నగలు చోరీకి గురైనట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. వారు కేసు నమోదు చేశారు.

సీఐటీయూ నేతల నిరసన

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని సీఐటీయూ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు నిరసనను శుక్రవారం చేపట్టిన అనంతరం డిప్యూటీ తహసీల్దార్ భాగ్యలక్ష్మికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పది గంటల పని విధానంతో కార్మికులు ఒత్తిడికి గురవుతున్నారని, వెంటనే దీన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మహిళా కార్మికులకు పని ప్రదేశంలో భద్రత కరువైందని చెప్పారు.

రబీ పోస్టర్ ఆవిష్కరణ

నెల్లూరు రూరల్: వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ – రబీ 2025 పోస్టర్‌ను కలెక్టర్ హిమాన్షు శుక్లా, కృషి విజ్ఞాన కేంద్ర జిల్లా సమన్వయకర్త డాక్టర్ లలిత శివజ్యోతి కలెక్టరేట్లో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అక్టోబర్ మూడు నుంచి 18 వరకు దేశ వ్యాప్తంగా నిర్వహించనున్నారని, రైతులకు ఆధునిక వ్యవసాయ సాంకేతికలు, శాస్త్రీయ పద్ధతులు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడమే ముఖ్య ఉద్దేశమన్నారు. మెరుగైన విత్తన రకాలు, సమగ్ర ఎరువు, పురుగు యాజమాన్యంపై అవగాహన కల్పించడం, ఆధునిక పద్ధతులు, నేల ఆరోగ్యం, నీటి వినియోగ సమర్థత, ప్రకృతి వ్యవసాయంపై సూచనలివ్వడం, ప్రభుత్వ పథకాలు, పంట బీమా, రుణ సౌకర్యాలు, మార్కెట్ అవకాశాలపై అవగాహన కల్పించడం, రైతుల వినూత్న ఆవిష్కరణలను ప్రోత్సహించడం ప్రధాన అంశాలని తెలిపారు.

ఉపాధి పనులపై అనాసక్తి

• మిగిలిపోతున్న పనిదినాలు
• పెరిగిన నాయకుల జోక్యం
• వర్షాలు కురిస్తే నిలిపివేసే అవకాశం
• అనుభవం లేని ఎఫ్ఏలతో నెరవేరని లక్ష్యాలు



పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

పొదలకూరు: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులకు హాజరయ్యేందుకు కూలీలు ఆసక్తి చూపడం లేదు. కూలీల చెల్లింపులు, అనుభవం లేని క్షేత్ర సహాయకులతో మండలంలో లక్ష్యాలను చేరుకోలేకపోతున్నాయి. ఇటీవల డ్వామా పీడీ సమీక్షా సమావేశం నిర్వహించి ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయితే పెద్ద మండలమైన పొదలకూరులో గతంలో నిత్యం మూడు వేల మంది కూలీలు పనులకు హాజరైతే ప్రస్తుతం 500 మంది రావడం గగనంగా మారింది. దీనికితోడు ఎక్కడ పనిపెట్టినా నాయకుల జోక్యంగా అధికం కావడంతో టీఏలు, ఈసీలు ఇబ్బందులు పడుతున్నారు. పనుల్లో తేడా వస్తే సోషల్ ఆడిట్‌లో రికవరీలు రాస్తున్నందున భయపడుతున్నారు. 2023 – 24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నిర్వహించిన సోషల్ ఆడిట్‌లో ఇద్దరు టీఏలు, ఒక ఈసీ ఉద్యోగాలు కోల్పోవడంతోపాటు వారికి రూ.లక్షలు రికవరీ రాశారు.

నత్తనడకన..

ఉపాధి కూలీలకు నగదు చెల్లింపులు జరిగినా పనులు అనుకున్న స్థాయిలో జరగడం లేదు. నత్తనడకన సాగుతున్నట్టు అధికారులే వెల్లడిస్తున్నారు. వర్షాలు కురిస్తే ఉన్న పనులను కూడా నిలిపేస్తారు. ఈ ఏడాది మే 20 నుంచి ఆగస్టు మొదటి వారం వరకు కూలీలకు నగదు చెల్లింపులు జరిగాయి. పొదలకూరు మండలంలో సుమారు రెండున్నర నెలలుగా 60 వేల మ్యాన్‌డేస్‌కు సంబంధించి ఆగస్టు వరకు రూ.1.50 కోట్లు కూలీలకు నగదు చెల్లింపులు జరగాల్సి ఉండేది. ప్రస్తుతం చెల్లింపులు జరిగినా పనులకు కూలీలు హాజరు అయ్యేందుకు అనాసక్తి ప్రదర్శిస్తున్నారు. నెలల తరబడి నగదు చెల్లింపులు జరగడం లేదని ఇందుకోసమే పనులకు వెళ్లాలంటే కష్టంగా ఉందని చెబుతున్నారు. వెంటనే డబ్బులు అందజేసే పనులకు కూలీలు వెళ్లడం వల్ల ఉపాధి పనులు ముందుకు సాగడం లేదని, అరకొరగా కూలీలు పనులకు హాజరవుతున్నట్టు క్షేత్ర సహాయకులు వెల్లడిస్తున్నారు. గతంలో అనుభవం ఉన్న ఎఫ్ఏల తొలగింపు, వేధింపులు తట్టుకోలేక స్వచ్ఛందంగా రాజీనామాలు ఇవ్వడంతో దాదాపుగా పాతవారు లేరు. కొత్తగా చేరిన ఫీల్డ్ అసిస్టెంట్లకు అనుభవం లేకపోవడంతో కూలీలను పనులకు రప్పించలేకపోతున్నారనే విమర్శలున్నాయి.

కూలీల సంఖ్యను పెంచుతాం

ప్రస్తుతం తరచూ వర్షాలు కుస్తున్నందున కూలీలు పనులకు సక్రమంగా హాజరుకావడం లేదు. మండలంలో 30 పంచాయతీలున్నాయి. పనులకు ఎక్కువ సంఖ్యలో కూలీలు హాజరయ్యేందుకు ప్రయత్నిస్తాం. కూలీల నగదు చెల్లింపులు ఆగస్టు మొదటి వారం వరకు జరిగాయి. త్వరలో ఫేస్ యాప్ అమల్లోకి వస్తుంది.

– వెంకటేశ్వర్లు, ఏపీఓ, పొదలకూరు

దారి.. అధ్వానంగా మారి..

తోటపల్లిగూడూరు: మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో పలు పంచాయతీ శాఖ రహదారులు దారుణంగా మారాయి. తీర ప్రాంత మండలమైన తోటపల్లిగూడూరులోని గ్రామాల్లో అంతంతమాత్రంగా ఉన్న రోడ్లు కొంత కాలంగా కురుస్తున్న చిన్నపాటి వానలకే దెబ్బతిన్నాయి. కోడూరు – కొత్తకోడూరు, వరకవిపూడి – అనంతపురం, పేడూరు – చింతోపు, సీఎస్‌పురం – మండపం లింక్ రోడ్లు గుంతలమయంగా మారాయి. దీంతో వాహనచోదకులు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించాలని కోరుతున్నారు.



వరకవిపూడి - అనంతపురం రహదారి ఇలా..



గుంతలమయంగా కోడూరు - కొత్తకోడూరు రోడ్డు

పోషణ్ మాసోత్సవాలు

ఇందుకూరుపేట: పోషణ్ మాసోత్సవాలను పురస్కరించుకొని జగదేవీపేట ఎంపీపీ స్కూల్ మెయిన్ అంగన్‌వాడీ కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మీదేవి మాట్లాడారు. మండల పరిధిలో వలసొచ్చిన కుటుంబాలకు గుర్తింపు కార్డుల్లేకపోయినా, వారి ఆరోగ్య పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని పౌష్టికాహారాన్ని అందించేలా చర్యలు చేపడతామని చెప్పారు. అనంతరం పౌష్టికాహారాన్ని అందజేశారు. సూపర్‌వైజర్ సుబ్బరత్నమ్మ, డిప్యూటీ హెచ్ఈఓ సుధాకర్‌రావు, బొల్లినేని రవికుమార్, హెల్త్ సూపర్‌వైజర్ రమ, సీహెచ్ఓ నందిని, ఏఎన్ఎంలు కల్పవల్లి, ధనలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు శీనమ్మ, రత్తమ్మ, దానమ్మ, హరిత, ఆశ వలంటీర్ స్వర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లక్ష్మీదేవి

వొకేషనల్ కోర్సులను సద్వినియోగం చేసుకోండి

కోవూరు: స్వయం ఉపాధి రంగాలపై దృష్టి సారించేందుకు గానూ వొకేషనల్ కోర్సులను బాలికలు సద్వినియోగం చేసుకోవాలని జీసీడీఓ మమత సూచించారు. పట్టణంలోని పచ్చిపాల రామనాథమ్మ జెడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులకు బ్యూటీషియన్ కోర్సుకు సంబంధించిన పలు ప్రాక్టికల్స్‌ను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. బాలికల భవిష్యత్తు కోసం ఎస్సెస్ఏ ఆధ్వర్యంలో బ్యూటీషియన్, ఐటీ, బేకరీ, ఫ్యాషన్ డిజైనింగ్ వంటి కోర్సులను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిందని వివరించారు. విద్యార్థినులు స్వయంగా మెహందీ వేశారు. బ్యూటీషియన్ కోర్సు ఇన్‌చార్జి కొటపూరి రజని ముఖర్జీ తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి

కోవూరు: పంటను రైతులు తప్పక నమోదు చేసుకోవాలని వ్యవసాయ సహాయ సంచాలకులు అనిత కోరారు. కోవూరు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల గ్రామ వ్యవసాయ సహాయకులతో సమీక్ష సమావేశాన్ని స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అక్టోబర్ 15 నాటికి నూరు శాతం పంట నమోదు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు. కలెక్టర్ సూచనల మేరకు ప్రత్యేక యూరియా కార్డును రూపొందించామని, దీని ద్వారానే రైతులకు ఎరువులను డిపోలు, సొసైటీల ద్వారా పంపిణీ చేయనున్నామని వివరించారు. అనంతరం మండలాల వారీగా సహాయకుల పనితీరును సమీక్షించారు. మండల వ్యవసాయాధికారులు రజని, విజయలక్ష్మి, శ్రీహరి, శశిధర్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అనిత

వైఎస్సార్సీపీ నేతల సమావేశం

కోవూరు: పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నేతలతో సమావేశాన్ని మాజీ మంత్రి, పార్టీ పీఏసీ సభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం నిర్వహించారు. పార్టీని మరింత బలోపేతం చేసే అంశమై చర్చించారు. పార్టీ మండలాధ్యక్షుడు అనూప్‌రెడ్డి, రైతు విభాగ జిల్లా అధ్యక్షుడు శివుని నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అనూప్‌రెడ్డి

బాలల ఆశ్రమానికి బియ్యం బస్తాల అందజేత

కొడవలూరు: మండలంలోని టపాతోపులో గల విశ్వజనని బాలల ఆశ్రమానికి రెండు బస్తాల బియ్యాన్ని విడవలూరు మండలంలోని రామతీర్థానికి చెందిన శివకుమార్ అందజేశారు. తన స్నేహితుడు సాయి జ్ఞాపకార్థం దీన్ని అందజేశానని ఆయన చెప్పారు. ఆశ్రమ నిర్వాహకులు బుర్లా శ్రీలక్ష్మి, ప్రేమ్‌సాగర్, సూరిశెట్టి పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



జెడ్పీ సీఈఓ ఆకస్మిక తనిఖీ

కోవూరు: మండలంలోని చెర్లోపాళెం పంచాయతీలో పారిశుధ్య, చెత్త నిర్వహణ పనులను జెడ్పీ సీఈఓ మోహన్‌రావు శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా గ్రీన్ అంబాసిడర్లకు అందజేయాలని కోరారు. తొలుత గ్రామంలోని చెత్తతో సంపద కేంద్రాలను పరిశీలించారు. ఈఓపీఆర్డీ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి కరుణ తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు వైద్య పరీక్షలు



కోవూరు: పడుగుపాడులో..



మనుబోలు : మందులు అందజేస్తున్న వైద్య సిబ్బంది

కోవూరు: పడుగుపాడు పంచాయతీ పరిధిలోని సచివాలయం – 2లో స్వస్థ్ నారీ.. సశక్త్ పరివార్ అభియాన్‌ను శుక్రవారం నిర్వహించారు. ఇందులో భాగంగా మహిళలకు వైద్య పరీక్షలు చేశారు. పౌష్టికాహార స్టాళ్లను అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేశారు. ఇనమడుగు పీహెచ్‌సీ వైద్యాధికారి ఇర్ఫాన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుమిత్ర తదితరులు పాల్గొన్నారు.

⇨ **మనుబోలు:** మండలంలోని మనుబోలు సచివాలయం – 1లో శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్యశ్రీ జిల్లా నోడల్ పర్సన్ కోటేశ్వరరావు మాట్లాడుతూ 70 సంవత్సరాల వయసు పైబడిన ప్రతి ఒక్కరికీ ఆయుష్మాన్ భవ కార్డులు అందజేస్తామన్నారు. వాటితో దేశంలో ఎక్కడైనా వైద్యసేవలు పొందవచ్చన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పద్మమ్మ, పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మాతాశిశు సంరక్షణకు చర్యలు చేపట్టాలి

నెల్లూరు(అర్బన్): మాతాశిశు సంరక్షణకు చర్యలు చేపట్టాలని డీఎంహెచ్ఓ సుజాత సూచించారు. మాతాశిశు మరణాలపై సబ్ కమిటీతో సమీక్ష సమావేశాన్ని నగరంలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో గల తన చాంబర్‌లో శుక్రవారం నిర్వహించారు. జూలై, ఆగస్ట్‌లో జిల్లాలో సంభవించిన తొమ్మిది శిశు.. ఒక మాతృ మరణంపై ఆడిట్‌ను జరిపారు. అనంతరం ఆమె మాట్లాడారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలపై కఠిన చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. ప్రతి ఏఎన్ఎం తమ పరిధిలో గర్భిణులను గుర్తించి తక్షణమే రిజిస్టర్ చేయాలని సూచించారు. ప్రభుత్వాస్పత్రుల్లో కాన్పులు జరిగేలా చూడాలని కోరారు. జేఎస్‌వై, జేఎస్కే సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన గర్భిణులు, బాలింతలకు లబ్ధి చేకూరేలా చూడాలని కోరారు. జిల్లా ఆస్పత్రుల సమన్వయాధికారి పరిమళ, ప్రభుత్వ పెద్దాస్పత్రి గైనకాలజీ విభాగాధిపతి గీతాలక్ష్మి, అనస్థీషియా ప్రొఫెసర్ విజయ్, డాక్టర్ గ్రేస్ ప్రియాంక, డీఐఓ ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

ఆదిపరాశక్తి పురస్కారాల ప్రదానం రేపు

నెల్లూరు(బృందావనం): నగరంలోని పురమందిరంలో విజయదశమి సంబరాలను ఆదివారం నిర్వహించనున్నామని కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు సుబ్బారావు పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను పురమందిర ప్రాంగణంలో శుక్రవారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. మహిళలకు ఆదిపరాశక్తి పురస్కారాలను ప్రదానం చేయనున్నామని వివరించారు. వివిధ పోటీలను నిర్వహించి బహుమతులను అందజేయనున్నామని తెలిపారు. రఘురామిరెడ్డి, అంకిరెడ్డి, ప్రసాద్, కృష్ణ, నాగిశెట్టి వెంకటరమణయ్య, పోలేపల్లి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

శక్తి రూపిణి.. వరదాయిని

పొదలకూరు: పట్టణంలో కన్యకాపరమేశ్వరీదేవి శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారు ధనలక్ష్మి అలంకారంలో దర్శనమిచ్చారు. ఉదయం అభిషేకాలు, ప్రత్యేక పూజలు, లలిత సహస్రనామార్చన, త్రిశతి, సాయంత్రం ఖడ్గమాల పూజలు జరిగాయి.

⇨ పట్టణంలో కామాక్షి సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో మహిళలు సామూహిక కుంకుమపూజ నిర్వహించారు. ప్రధానార్చకులు ప్రసాద్‌స్వామి, కుమార్ స్వామి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

⇨ మండలంలోని మరుపూరు కామాక్షి సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలో అమ్మవారిని లక్ష్మీదేవిగా అలంకరించారు. కలిచేటి శ్రీనివాసులురెడ్డి దంపతులు, సుబ్బారెడ్డి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

⇨ శ్రీనివాస లేఅవుట్ శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారు జయలక్ష్మి అలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా కోనం చినబ్రహ్మయ్య – హైమావతి దంపతులు వ్యవహరించారు.

⇨ ఇనుకుర్తి కాంతమ్మతల్లి ఆశ్రమంలో అమ్మవారిని పార్వతీదేవిగా అలంకరించారు. ఉదయం అభిషేకాలు, పూజలు జరిగాయి.

⇨ **తోటపల్లిగూడూరు:** మండలంలోని నరుకూరు ఇందిరా కాలనీలో ఉన్న రాజరాజేశ్వరి ఆలయంలో అమ్మవారు మధుర మీనాక్షి అలంకారంలో దర్శనమిచ్చారు. అలాగే వరిగొండ దేవళాలమిట్టలో ఉన్న జ్వాలాముఖి అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి మహోత్సవాలు వేడుకగా జరుగుతున్నాయి. పూజా కార్యక్రమాలకు వేమూరి రామ్మూర్తి ఉభయకర్తగా వ్యవహరించారు.

⇨ **మనుబోలు:** మండలంలోని మనుబోలు కోదండరామపురంలో ఉన్న పోలేరమ్మ ఆలయంలో అమ్మవారు మహాలక్ష్మి అలంకారంలో దర్శనమిచ్చారు. అర్చకులు శ్రీనివాసులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉభయకర్తలుగా పూండ్ల సాయి, హర్షిత వ్యవహరించారు.

⇨ **వెంకటాచలం:** మండలంలోని కాకుటూరు వద్ద నున్న రాజరాజేశ్వరి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. అమ్మవారు భవానీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం కుంకుమపూజ, పల్లకి సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు కుంకాల బ్రదర్స్, పిండిబోయిన వెంకయ్య, అన్నమ్మ ఉభయకర్తలుగా వ్యవహరించారు.



మనుబోలు: మహాలక్ష్మి అలంకారంలో..

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: జొన్నవాడలో వెలసిన మల్లికార్జున సమేత కామాక్షితాయి ఆలయంలో అమ్మవారు రాజరాజేశ్వరిదేవిగా దర్శనమిచ్చారు. పుణ్యాహవచనం, కలశపూజలు, సామూహిక కుంకుమార్చన, మహానవావరణ పూజను నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. దేవదాయ శాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్ దర్శించుకున్నారు. ఈఓ శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

కోవూరు: పట్టణంలోని పాటూరు రోడ్డులో గల రాజరాజేశ్వరి దేవస్థానంలో మహాలక్ష్మిగా అమ్మవారు దర్శనమిచ్చారు. పూజలను ఆలయ ప్రధానార్చకుడు గూడలి మనోహర్‌శర్మ ఆధ్వర్యంలో జరిపారు. ఉభయకర్తలుగా ఫణికుమార్‌రెడ్డి, స్వర్ణలత, నీలిమ, రఘునాథరెడ్డి వ్యవహరించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు ఆలూరు శ్రీనివాసులురెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ స్వరూప్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

⇨ స్థానిక రైల్వే రోడ్డులోని కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారు గజలక్ష్మిగా దర్శనమిచ్చారు. ఆలయ ప్రధానార్చకుడు అవధానం నందకిశోర్ ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఉభయకర్తలుగా వెంకటసుబ్బారావు, పద్మజ దంపతులు వ్యవహరించారు. ఆలయ చైర్మన్ వెంకటేశ్వర్లు, రమేష్‌బాబు, మెంటా రమేష్ తదితరులు పాల్గొన్నారు.



వెంకటాచలం : భవానీ అలంకారంలో..



పొదలకూరు : వెంకటేశ్వరస్వామి ఆలయంలో..



పొదలకూరు : మహిళా భక్తుల సామూహిక కుంకుమ పూజలు



పొదలకూరు : మరుపూరులో లక్ష్మీదేవిగా..



కోవూరు: మహాలక్ష్మిగా రాజరాజేశ్వరి



కోవూరు: గజలక్ష్మిగా కన్యకాపరమేశ్వరి



టీపీగూడూరు : మధుర మీనాక్షిగా రాజరాజేశ్వరి